ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం సెప్టెంబరు 1, 2026

ఆస్తులు పురపాలకానివి.. ఆదాయం దళారులది

ఇల్లెందు, న్యూస్‌టుడే

పట్టణంలో పురపాలిక ఆస్తులు కబ్జాకు గురవుతున్నాయి. స్థలాలు, గదులు కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. కాపాడాల్సిన అధికారులు, పాలకవర్గం దళారులకు కొమ్ముకాస్తుండటంతో పురపాలకం ఆదాయం కోల్పోతోంది.

రూ.లక్షల వ్యయం వృథా

మెయిన్‌రోడ్ ఉన్నత పాఠశాల సమీపంలో పలువురు పురపాలిక, పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు చేసేవారు. ఈ విషయాన్ని గుర్తించిన గత పాలకవర్గం వారి వ్యాపారాలు చట్టబద్ధం చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి మొత్తం 26 గదులు నిర్మించి పలువురికి కేటాయించింది. ఇంతలో పలువురు పాఠశాల స్థలమంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టుకు వెళ్లిన వ్యక్తులను సముదాయించి ప్రస్తుత పాలకవర్గం ఓ ఒప్పందం చేసుకోవడంతో సమస్య పరిష్కారమైంది. సమస్య తీరినా పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారులు గదుల నుంచి అద్దె వసూలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పురపాలిక ఆదాయానికి నష్టం జరుగుతోంది. ఒక్కో గదికి నెలకు రూ.2వేల అద్దె నిర్ణయించినా నెలకు రూ.52వేలు ఆదాయం పురపాలికకు వస్తుంది.

ఇతరులకు అద్దెకు..

పురపాలికం నిర్మించిన గదులను కొందరు ఆక్రమించుకున్నారు. అంతేగాక సుమారు రూ.50వేల నుంచి రూ.లక్ష అడ్వాన్సులు తీసుకుని నెలకు రూ.3వేలు అద్దె వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమైనా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఇటీవల కొందరు వ్యాపారులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విషయం తెలపడంతో ఆయన పుర అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి అర్హులకు గదులు కేటాయించాలని సూచించినట్లు సమాచారం.

మెయిన్‌రోడ్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన గదులు

చర్యలు చేపడతాం..

గదుల్లో ఉన్న వారి వివరాలు సేకరించాం. అర్హులకు గదులు కేటాయించి అద్దె వసూలు చేస్తాం.

- శ్రీనివాస్, పురపాలిక టీపీఎస్

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామాల్లో భూముల రీ-సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠతో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం తహసీల్దార్లు, సర్వేయర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సర్వే అండ్ బౌండరీ చట్టంపై తహసీల్దార్లు, సర్వేయర్లు పూర్తి అవగాహన పెంపొందించుకొని పొరపాట్లకు తావులేకుండా రీ-సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ముందుగా రైతులకు, పట్టాదారులకు సమాచారం అందించి, గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలకు సంబంధించిన వివరాలు తెలియజేయడంతోపాటు, రికార్డుల్లో వివరాలను నమోదు చేయాలన్నారు. డీఆర్వో పద్మావతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

చిన్న కొలువులు.. పెద్దల సిఫార్సులు

● అంగట్లో అంగన్‌వాడీ ఉద్యోగాలు

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీలోనూ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుంటున్నారు. పలువురు ఎమ్మెల్యేలు తమ అనుచరగణానికి పంచి పెట్టడానికి సిఫార్సులు చేస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ఖమ్మం జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యే, ఇంకో జిల్లాకు చెందిన ఓ మంత్రి కుమారుడు కూడా రంగంలోకి దిగారు. తమకు నచ్చిన వారి పేర్లతో లెటర్లు సిద్ధం చేసి అధికారులకు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఓ ఎమ్మెల్యే ఏకంగా 40కి పైగా పంపినట్లు సమాచారం. మరొకరు తన పరిధిలోని దాదాపు సగానికి పైగా పోస్టులకు సిఫార్సులు చేసినట్లు తెలుస్తోంది. మరో రెండ్రోజుల్లో ఇంటర్వ్యూలు మొదలుకానున్నాయి. దీంతో భర్తీలో పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంతా పీఏలతోనే..

ఆ ఎమ్మెల్యేలు నేరుగా తమ లెటర్‌ప్యాడ్‌పై కాకుండా, అభ్యర్థుల దరఖాస్తులను, సాధారణ లేఖలను పంపిస్తున్నారు. వ్యక్తిగత సహాయకులతో పంపిస్తూ.. తమ చేతికి మట్టి అంటకుండా చూస్తున్నారు. ఓ ఎమ్మెల్యే మాత్రం నేరుగా తన లెటర్ ప్యాడ్‌పైనే రాసిచ్చినట్లు సమాచారం. ఇదే అదునుగా వారి పీఏలు, మండల స్థాయి నాయకులు కూడా ఉద్యోగాలిప్పిస్తామంటూ డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలున్నాయి.

స్థానికేతరులకు ఇప్పించేలా..

స్థానికులకే భర్తీలో ప్రాధాన్యం ఇస్తారు. పోస్టులున్న గ్రామాల్లోనే నివసిస్తున్నట్లు పలువురు తప్పుడు నివాసం సర్టిఫికెట్లను పొందుతున్నారు. ఓ మహిళ పక్క గ్రామంలో నివాసం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇల్లెందు నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడింది. వారి ఆధార్, ఓటరు పత్రాలన్నీ అక్కడే ఉన్నాయి. తాజాగా ఆమె ఇక్కడే ఉంటున్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కొందరు నాయకులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

స్వర్ణలత లెనినా, డీడబ్ల్యూవో

ఎమ్మెల్యేల నుంచి మాకు ఎలాంటి సిఫార్సు లేఖలు రాలేదు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు అడిగితే వారిని నమ్మకండి. అలాంటి వాటిని మా దృష్టికి తీసుకురావాలి. తప్పుడు నివాస పత్రాలు పెడుతున్న వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగుల చేతివాటం..

మండలాల్లోని సీడీపీవో, సూపర్‌వైజర్లు గ్రామాల వారీగా జాబితా పంపిస్తారు. ఇంటర్ మార్కుల ఆధారంగా గ్రామంలో ఎవరికి ఉద్యోగం వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయో వారికి తెలుస్తుంది.

◆ వాటి ఆధారంగా మొదటి స్థానంలో ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు సీడీపీవో, సూపర్‌వైజర్లు దండుకుంటున్నారని చర్చ నడుస్తోంది.

◆ తాజాగా పాల్వంచ మండలం గొల్లగూడెంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హురాలు ఒక్కరే ఉన్నారు. దానిని గుర్తించిన ఓ ప్రజాప్రతినిధి ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తామంటూ డబ్బులు డిమాండ్ చేశారు.

◆ ఆ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై అధికారులు ఎలాంటి విచారణ చేయకపోవడం గమనార్హం.

జీసీసీ జాగా.. అక్రమార్కుల పాగా

దారి లేక రేషన్‌దారుల ఇక్కట్లు

టేకులపల్లి, న్యూస్‌టుడే

మండల కేంద్రంలోని జీసీసీ చౌకదుకాణం స్థలం కబ్జాకు గురైంది. చౌక దుకాణానికి రెండు భవనాలు ఉన్నప్పటికీ ప్రధాన రహదారి మార్గాన్ని కొందరు వ్యాపారులు ఆక్రమించారు. దీంతో రేషన్‌దారులు మసీద్‌కు వెళ్లే మార్గం నుంచి చౌక దుకాణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి బియ్యం, ఇతర నిత్యవసరాలు దిగుమతికి వచ్చిన సమయాల్లో వాటిని దుకాణంలోకి చేరవేసేందుకు చౌకదుకాణ నిర్వాహకులకు ఇబ్బందికరంగా మారింది. దుకాణం ఎదురుగా ఉన్న ఆక్రమణలను తొలగిస్తే బియ్యం, నిత్యవసరాల సంచులను దిగుమతి చేసుకునేందుకు అనువుగా ఉంటుంది.

● ఆక్రమణల తొలగింపు సున్నితమైన అంశం కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా స్పందించడం లేదు. ఫలితంగా రేషన్‌దారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

● మరోవైపు దుకాణం వద్ద సైడ్‌డ్రైన్‌లు కూడా మురుగుతో నిండి దుర్వాసన వస్తుండటంతో రేషన్‌దారులు ఇబ్బంది పడుతున్నారు.

● జీసీసీ దుకాణం ముందు నుంచి దారి ఏర్పాటు చేయడంతో పాటుగా కాల్వల్లో పూడిక తీయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కబ్జాకు గురైన జీసీసీ దుకాణం ఎదుట ప్రధాన రహదారి స్థలం

నిఘా

మణుగూరు.. ముఠాలతో కంగారు

అడ్డదారిలో కొందరు యువత

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే

కొంతమంది యువత స్ఫూర్తిగా ఉండాలని అనుకుంటారు. ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని భావిస్తారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు బృందాలుగా ఏర్పడతారు. కానీ జిల్లాలోని మణుగూరులో అందుకు భిన్నమైన సంస్కృతి కనిపిస్తోంది.

★ గ్యాంగ్‌లతో హల్‌చల్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారనడానికి ఇటీవల జరిగిన శివకుమార్ హత్యే ఉదాహరణ.

పంతాలకు పోయి ఘర్షణలు..

■ కొందరు యువకులు పెడదోవ పడుతూ వివాదాలకు కారణమవుతున్నారు. పంతాలకు పోయి ఘర్షణలు పడుతున్నారు. గ్యాంగ్‌లుగా ఏర్పడి ఘర్షణలకు తెరలేపుతున్నారు. ఇటీవల మూకుమ్మడి దాడిలో ఓ యువకుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరనిశోకం మిగిల్చింది.

■ మణుగూరులో సుమారు 8 వరకు గ్యాంగ్‌లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారంతా వాట్సప్ గ్రూప్‌లను క్రియేట్ చేసుకుని సమాచారాన్ని చేరవేసుకుంటున్నారు. ఘర్షణలు పడటం, పంచాయితీలు చేయడం, బెట్టింగ్‌లకు పాల్పడటం వంటి పనులు చేస్తున్నారు.

■ ముఠాల్లో అంతా 25 ఏళ్లలోపు వారే ఉండటం గమనార్హం. కొందరు చదువుకుంటున్న వారూ ఉండటంతో ఆందోళన కలిగిస్తోంది. ఉన్నతంగా స్థిరపడాల్సిన వారు జీవితాన్ని నాశనం చేసుకోవడంతోపాటు తల్లిదండ్రులను మనోవేదనకు గురి చేస్తున్నారు.

ఆదిలోనే కట్టడి చేస్తేనే..

వారి ఆగడాలను పోలీసులు ఆదిలోనే కట్టడి చేయాల్సిన అవసరముంది. లేదంటే భవిష్యత్తులో పెను విషాదాలను మిగిల్చే అవకాశం లేకపోలేదని పలువురు వాపోతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారు, ఏం చేస్తున్నారనే విషయాన్ని గ్రహించాల్సిన ఆవశ్యకత ఉంది. మాకు ఏమి కాదు, మమ్మల్ని ఎవరూ ఏం చేయరనే భావన యువకుల్లో ఉండటంతో పెచ్చుమీరుతున్నారు. వారిలో పరివర్తన అవసరం. మార్పు తీసుకొచ్చేందుకు పోలీసులతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. గొడవలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తే మేలు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

రవీంద్రారెడ్డి, డీఎస్పీ

గ్యాంగ్ కల్చర్‌ని ఉపేక్షించం. నిఘా పెట్టి నియంత్రిస్తాం. మంచి పనులు చేసేందుకు బృందంగా ఏర్పడాలి. అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు పెట్టుకుంటే చర్యలు తీసుకుంటాం.

లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని మించి కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించగా అందులో అత్యధిక మొత్తం ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని గనులనుంచే కావడం గమనార్హం. సోమవారం ఉదయానికి సింగరేణి సంస్థ మొత్తంగా 38,78,152 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉండగా 41,31,432 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. అంటే 107శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందన్నమాట. ఆగస్టు నెలతో సింగరేణి సంస్థ వరుసగా నాలుగు నెలల నుంచి ప్రతినెలా నూరు శాతం లక్ష్యాన్ని అధిగమిస్తూ వస్తోంది.

అత్యధిక మొత్తం మన గనుల నుంచే..

సింగరేణి వ్యాప్తంగా మిగిలిన జిల్లాల్లోని ఏరియాల కన్నా ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, మణుగూరు ఏరియాలోని గనులు అత్యధిక శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయి. 174శాతం ఉత్పత్తి లక్ష్యంతో సత్తుపల్లి ఏరియా సింగరేణిలోనే ప్రథమస్థానంలో నిలుస్తుండగా 166శాతం ఉత్పత్తి లక్ష్యంతో మణుగూరు ఏరియా కంపెనీస్థాయిలో ద్వితీయస్థానంలో ఉంది. 123 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో రామగుండం1 ఏరియా కంపెనీలో తృతీయస్థానంలో ఉంది. ఈ మూడు ఏరియాల గనులే నూరుశాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయి. రామగుండం2 ఏరియా 96శాతం, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు 86శాతం, రామగుండం3 ఏరియా 79శాతం, ఇల్లెందు ఏరియా 61 శాతం, శ్రీరాంపూర్, అడ్రియాల ఏరియాలు 53శాతం, కొత్తగూడెం ఏరియా 38శాతం, భూపాలపల్లి ఏరియా 33శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయి. వర్షాకాలం అయినప్పటికీ వర్షాలు లేని కారణంగా సింగరేణి సంస్థ మున్నెన్నడూ లేని విధంగా జూన్, జులై, ఆగస్టు నెలల్లో నూరుశాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించింది.

ప్రత్యేక ఆకర్షణగా సర్జ్ టవర్

ఈ చిత్రంలోనిది సర్జ్ టవర్. సర్జ్ షాఫ్ట్ అని కూడా పిలుస్తారు. అశ్వాపురంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంలో ఇది కీలకం. నీటి ఒత్తిడి కారణంగా పైపులు పగిలిపోకుండా కాపాడుతుంది.

ఎత్తిపోతల పథకాన్ని ఆఫ్ చేసినప్పుడు, నడుస్తున్న క్రమంలో అనుకోకుండా విద్యుత్తు అంతరాయం సంభవించి నిలిచినప్పుడు వేగంగా ప్రవహించే నీరు ఒక్కసారిగా నిలిచి రెట్టింపు వేగంతో వెనుకకు ప్రవహిస్తాయి. పైపులపై ఒత్తిడి పెరిగి పగిలిపోయే అవకాశం ఉంటుంది. అవి పగిలిపోకుండా జలవనరులశాఖ అధికారులు ప్రత్యేకంగా దీనికి రూపకల్పన చేశారు. ఇది పైపులైన్‌కు అనుసంధానంగా ఉంటుంది. ఎయిర్ వాల్వ్‌గా కూడా ఉపయోగపడుతుంది. పైపులలో నుంచి వెనుకకు వచ్చే నీరంతా ఒక్కసారిగా టవర్ పైభాగంలోకి చేరుకుని వెలుపలికి చిమ్ముతుంది. దాదాపు ఈ టవర్ 34 మీటర్ల ఎత్తు ఉంటుంది. పైభాగంలో టవర్‌కు అనుసంధానంగా మరో 10 మీటర్ల పొడవుతో ఓ చిన్న పైప్ కిందికి అమర్చబడి ఉంటుంది. దీని ద్వారా టవర్‌లోని నీరు వెలుపల కిందకు ప్రవహిస్తుంది. అడుగు భాగం బలంగా ఉండేలా దీని చుట్టూ 6 మీటర్ల వెడల్పు 3 మీటర్ల ఎత్తుతో త్రిభుజాకారంలో భారీ కాంక్రీటు నిర్మాణం చేపట్టనున్నారు. అశ్వాపురం, న్యూస్‌టుడే

సరదాగా సాధన.. పట్టుదలతో సౌత్‌జోన్‌కు..

సరదాగా సాధన చేసిన ఈ యువకులు ఏకంగా సౌత్ జోన్ క్రీడలకు ఎంపికయ్యారు. యువత దేన్నైనా సునాయాసంగా నేర్చుకోవడమే కాకుండా అందులో ప్రతిభ చూపిస్తున్నారనడానికి వీరు నిదర్శనం. యువజన, క్రీడల విభాగం ఆధ్వర్యంలో 2025 జనవరి 3న రైఫిల్, పిస్టల్ షూటింగ్ ట్రైనింగ్ సెంటర్ కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు.

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

● అబ్దుల్‌నబీ మహ్మద్ కోచ్‌గా నైపుణ్యాలను నేర్పుతుండగా గమనించిన నవీన్, రవికుమార్ ఆయన వద్ద శిక్షణ పొంది జూన్ 27న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సౌత్‌జోన్‌కు ఎంపికయ్యారు.

దేశానికి పేరుతేవాలని..

డీ ఫార్మసీ చదువుతున్న బి.నవీన్ రైఫిల్, పిస్టల్ షూటింగ్‌ను 8 నెలలుగా నేర్చుకుంటున్నాడు. ట్రైనింగ్ సెంటర్‌ను చూసేందుకు స్నేహితులతో వెళ్లిన అతడు షూటింగ్‌పై ఆసక్తిని పెంచుకొన్నాడు. రాష్ట్ర స్థాయి పిస్టల్ షూటింగ్‌లో ప్రతిభ చాటాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించి దేశానికి పేరుతీసుకురావాలన్న లక్ష్యంతో నిరంతర సాధన చేస్తున్నట్లు చెబుతున్నాడు.

బి.నవీన్

ఆట

ఉద్యోగం చేస్తూనే షూటింగ్..

యూకే బేస్డ్ కంపెనీలో (ఐటీ) వర్క్ ఫ్రం హోం ఉద్యోగం చేస్తున్నారు వై. రవికుమార్. కేవలం చదువు, ఉద్యోగం మాత్రమే కాకుండా ఏదైనా ఒక క్రీడలో నైపుణ్యాన్ని పొందాలన్న ఆలోచనతో షూటింగ్ నేర్చుకొనేందుకు ఆసక్తి కనబర్చాడు. 5 నెలల కాలంలోనే సౌత్‌జోన్‌కు ఎంపికయ్యాడు. పిస్టల్ షూటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పాడు.

రవి కుమార్

ఇంకా 30 శాతం లోటు వర్షపాతమే

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. దీనికి తోడు భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. గత వారం రోజుల నుంచి అడపదడపా వానలు కురుస్తున్నా వర్షపాతం మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నా వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండి, పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆరు మండలాల్లో సాధారణం..

మొత్తం వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 759.1 మి.మీ.సాధారణ వర్షపాతానికి గాను 531.4 మి.మీ. నమోదైంది. 30 శాతం లోటు వర్షపాతంగా ఉంది. మండలాల వారీగా పరిస్థితి గమనిస్తే ఆరు మండలాల్లో సాధారణం, ఇతర అన్ని మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది.

ఆందోళన కలిగిస్తున్న భూగర్భ జలాలు

2026 జులైలో భూగర్భ జలాల లభ్యత గత ఏడాది జులైతో పోలిస్తే జిల్లా ప్రమాదకర పరిస్థితిలో ఉంది. దమ్మపేట మండలంలో గత జులైలో 42.58 మీటర్లు కాగా, ఈ జులైలో 42.71 మీటర్లకు పడిపోయింది. చంద్రుగొండ మండలంలో 23.31 మీటర్ల నుంచి 23.43 మీటర్లకు, అశ్వారావుపేట మండలంలో 20.93 మీటర్ల నుంచి 33.63 మీటర్లకు, అన్నపురెడ్డిపల్లి మండలంలో 15.81 మీటర్ల నుంచి 16.36 మీటర్లకు భూగర్భ జల నీటి లభ్యత పడిపోయింది.

సేద్యం కుంటలు ఏర్పాటు చేసుకోవాలి

రవికుమార్, అశ్వారావుపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు

వర్షపాతాన్ని అనుసరించి పంటలు సాగు చేయాలి. ముఖ్యంగా సెప్టెంబరు వరకు ఉండే నైరుతి రుతుపవనాలతో వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో పంటల సాగులో యాజమాన్య పద్ధతులు అనుసరించాలి. బోరుబావుల సౌకర్యం ఉన్న రైతులు పంటల సాగుకు వినియోగ సామర్థ్యం పెంచేలా నీటిని పొదుపుగా వాడాలి. వీబీజీరామ్‌జీ పథకంలో భాగంగా సేద్యం కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

ఆర్థికవేత్త వర్సిటీకి ఇబ్బందులు

పాల్వంచ, న్యూస్‌టుడే

పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ భూవిజ్ఞాన విశ్వవిద్యాలయానికి (ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ) ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దేశంలోనే ఏకైక, ప్రత్యేకమైన ఈ విశ్వవిద్యాలయానికి ఆర్థికవేత్త పేరు నామకరణం చేసినప్పటికీ ఆర్థిక భరోసా లేక నిర్వహణ భారంగా మారుతోంది. ఇంజినీరింగ్ కళాశాల నుంచి యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ నయా పైసా లేకుండా వర్సిటీ నిర్వహణ కొనసాగుతోంది. కేవలం డిగ్రీ, పీజీ కోర్సుల నిర్వహణకు పురాతన భవనాలకు రేకులు ఏర్పాటు చేసి బోధన సాగిస్తున్నారు. ఇటీవల శాసనసభలో మంత్రి వర్గం ఆమోదంతో వర్సిటీ అభివృద్ధికి రూ.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఆచరణలో ఇంకా నోచుకోవడం లేదు.

నిర్వహణ భారం

అరుదైన భూగర్భ సంపద, సముద్ర అంశాలపై పరిశోధన సాగించాల్సిన చోట వర్సిటీ సరైన మౌలిక వసతులు, సదుపాయాలు లేక కష్టాలు పడాల్సివస్తోంది. రెండేళ్లుగా యూజీ (అండర్ గ్రాడ్యుయేట్), పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్)లో బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జియాలజీ కోర్సులు నిర్వహణ కొనసాగుతున్నాయి. డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు ఇంజినీరింగ్ కోర్సులు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ నేటికి వర్సిటీకి కనీసం ప్రిన్సిపల్, రిజిస్ట్రార్, వైస్ ఛాన్సలర్ పూర్తిస్థాయి బాధ్యతలు లేకపోవడంతో నేటికి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులే నెట్టుకొస్తున్నారు. కనీసం డిగ్రీ, పీజీ బోధన సాగించే భవనాలకు ప్రహరీ రక్షణ లేని దుస్థితి నెలకొంది.

డిగ్రీ, పీజీ కోర్సుల తరగతులు నిర్వహించేది ఈ రేకుల షెడ్లలోనే..

వరంగల్ టు హైదరాబాద్ వెళ్లాల్సిందే..

జగన్‌మోహన్‌రాజు, వర్సిటీ ఓఎస్డీ

వర్సిటీకి సంబంధించిన ఏ చిన్న పనికైనా వరంగల్ రిజిస్ట్రార్ నుంచి హైదరాబాద్ వైస్ ఛాన్స్‌లర్ వద్దకు వెళ్లాల్సిందే. ఇప్పటికై సొంత నిధులతో రాకపోకలు సాగించడం జరుగుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. వర్సిటీ సత్వరమే అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నమ్మకం కలుగుతోంది.

ఘటనలప్పుడే ప్రత్యక్షం.. ఆస్పత్రుల్లో రక్షణ ప్రశ్నార్థకం

ఈనాడు పరిశీలన

జిల్లా సర్వజన ఆసుపత్రి, రామవరం ఎంసీహెచ్‌లో రాత్రి సమయాల్లో ఘర్షణలు చెలరేగుతున్నాయి. పసికందులు, బాలింతలు, మరణించిన సందర్భాల్లో ఎంసీహెచ్‌లో పోలీసు బృందం చేరుకుంటే తప్పితే అడ్డుకట్ట పడటం లేదు. జిల్లా సర్వజన ఆసుపత్రిలోనూ ఇదే పరిస్థితి. గతంలో అనేక మార్లు వైద్యులు, సిబ్బందిపై దాడి యత్నాలు జరిగాయి. సెక్యూరిటీ గార్డుపై ఎగబడిన వ్యక్తిని అడ్డుకునేందుకు ప్రయత్నించి ఆ సెక్యూరిటీ గార్డు ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఒక వైద్యుడి కారు ధ్వంసమైన ఘటనలూ లేకపోలేదు. మిగతా వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లోనూ పోలీసు రక్షణ చర్యలు కొరవడుతున్నాయి. ప్రధాన ఆసుపత్రుల్లో పోలీస్ ఔట్‌పోస్టు కేంద్రాలు లేకపోవడంతో అనర్థాలు తలెత్తుతున్నాయి.

కొత్తగూడెం వైద్య విభాగం, న్యూస్‌టుడే

మందుబాబుల వీరంగం..

సర్వజన ఆసుపత్రిలో రాత్రివేళ మందుబాబుల వీరంగం పెరిగిపోతోంది. తాజాగా ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఇటీవలే ఎంసీహెచ్‌లో అర్ధరాత్రి ఆందోళన చేపట్టిన వారిని నేరుగా సీఐ తన సిబ్బందితో వెళ్లి నిలువరించాల్సి వచ్చింది. గతంలో ఎంసీహెచ్‌లో ఔట్‌పోస్టును కొనసాగించారు. ఇటీవల తొలగించారు. సర్వజన ఆసుపత్రిలోనూ ఇదే తంతు. రాత్రి సమయాల్లో భయాందోళన రేకెత్తిస్తున్న ఘటనల నేపథ్యంలో నిత్యం పోలీసుల పర్యవేక్షణ తప్పనిసరి. ఔట్‌పోస్టును అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. అందుకు అవసరమైన గదులు అందుబాటులో ఉన్నాయి. ఎస్పీకి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధామోహన్ పేర్కొంటున్నారు.

జిల్లా సర్వజన ఆసుపత్రిలో నిరుపయోగంగా నిర్మాణ గదులు

రాత్రి వేళ.. ఘర్షణలు

ఇల్లెందు ఏరియా ఆసుపత్రిలో రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్య ఘటనలు ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు అందుబాటులో ఉన్నా.. నియంత్రణ సాధ్యం కావడం లేదు. ఇల్లెందు పట్టణం, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి రోజు 500లపై చిలుకు రోగులు వైద్య సేవలకు వస్తున్నారు. ఇన్ పేషంట్లుగా 30 మంది వరకు ఉంటున్నారు. ఆసుపత్రిలో సమస్య తలెత్తినప్పుడు ఆందోళనలను నివారించే పరిస్థితులుండటం లేదు. పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు అనివార్యం.

ఇల్లెందు, న్యూస్‌టుడే

ఆస్పత్రిలో రోగుల రద్దీ

భద్రత కట్టుదిట్టం

నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఏరియా ఆసుపత్రిలో పోలీస్ ఔట్‌పోస్టు కేంద్రం రక్షణగా నిలుస్తోంది. 200ల పడకలున్న ఆసుపత్రిలో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకుంటే పోలీసుల రక్షణ కట్టుదిట్టం చేస్తుంది.

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పోలీసు ఔట్‌పోస్టు

రైతురాజు 6లో

జ్ఞాపకాల మదిలో..
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప

స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఖమ్మం: 8008510764, 8008709925, 8008709924
కొత్తగూడెం: 8008709920, సత్తుపల్లి: 8008001776
భద్రాచలం, మణుగూరు: 8247668656, మధిర, ఇల్లెందు: 8008510764

(c) eenadu

పూల పండగలు వచ్చేస్తున్నాయ్..

వైరా, తల్లాడ, న్యూస్‌టుడే

పూల పండగలు ఇప్పటికే వచ్చేశాయి. శ్రావణ మాసంలో మొదలైన వేడుకలు విజయ దశమి బతుకమ్మ ఉత్సవాలకు పూర్తి పూలమయంగా మారుతాయి. ఈ క్రమంలోనే అయ్యప్ప మాలధారణ భక్తుల సీజన్ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో బంతిపూలు, చామంతి పూల సాగు వివిధ దశల్లో ఉంది. విడి పూలకు డిమాండ్ ఉన్న తరుణంలో రైతులు తగిన సాగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వైరా కేవీకే శాస్త్రవేత్తలు పావని, ఫణిశ్రీ పేర్కొన్నారు.

సస్యరక్షణ..

బంతి, చామంతికి నీటి తడులు ముఖ్యం. ఆరేడు వారాల నుంచే పూత మొదలవుతుంది. శాఖీయ, పూత దశలో తేమ అవసరం. నీటి ఎద్దడికి గురైతే దిగుబడి తగ్గుతుంది. ఎత్తుగా పెరిగే ఆఫ్రికన్ బంతి రకంలో చివరిగా పూమొగ్గ పెరుగుతుంది. దీన్ని తుంచివేస్తే పక్క కొమ్మలు అధికమై ఎక్కువ పూలు పూస్తాయి. మొగ్గ నుంచి విచ్చుకున్న పూలు త్వరగా వస్తాయి. చామంతి మొక్కలు రాత్రి సమయం ఎక్కువగా పెరుగుతాయి. ఇవి పూలు పూసేటప్పుడు బరువుకు వంగి పోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మేలు. వీటి తలలు తుంచి వేస్తే పక్క కొమ్మలు ఎక్కువై దిగుబడి పెరుగుతుంది. చామంతి సాగు సఫలమైతే ఎకరాకు ఆరేడు టన్నుల దిగుబడి తీయొచ్చు. బంతి సైతం మంచి లాభాలను ఇస్తుంది.

* బంతి, చామంతిలో పేను బంక సమస్య ఉంది. తల్లి, పిల్ల పురుగులు మొక్క అన్ని భాగాల నుంచి రసం పీల్చి జిగట పదార్థాన్ని విడుదల చేస్తాయి. దీంతో ఆకులపై శిలీంద్రాలు ఏర్పడి ఎదుగుదల ఆగిపోతుంది. కిరణజన్య సంయోగక్రియ ఆగి మొక్క బలహీనమవుతుంది. దిగుబడి రాదు. నివారణకు ఎకరానికి 15 పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి. వేపనూనె 5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* తామర పురుగులు అతి సూక్ష్మంగా ఉండి ఆకు అడుగు భాగం నుంచి రసం పీల్చుతాయి. ఆకుల మీద తెల్లటి మచ్చలు ఏర్పడి పసుపురంగులోకి మారుతాయి. నివారణకు పసుపు రంగు జిగురు అట్టలతో పాటు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* పచ్చపురుగు సమస్య ఉంది. ఇది గొంగళి పురుగు జాతికి చెందింది. ఇది ఆకులు, పూలను నష్టపరుస్తుంది. నివారణకు ఇండోక్సాకార్బ్, నోవాల్యూరాన్ అనే మందును మి.లీ., ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా డైనోకాప్ మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* ఆకుమచ్చ, పువ్వు కుళ్లు తెగులు నియంత్రణకు మ్యాంకోజెబ్ మూడు గ్రాములు లేదా క్లోరోథాలోనిల్ రెండు గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రైతేరాజు

ఉద్యాన పంటలకు ఊతం

సోలార్ డ్రైయర్ల విధానంలో ఎండబెట్టే విధానాన్ని వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారి వేణు

కొణిజర్ల, తల్లాడ, న్యూస్‌టుడే

పండ్లు, కూరగాయలకు మంచి దిగుబడి వచ్చినా మార్కెట్‌లో ఒకేసారి అధిక సరకు రావడంతో ధరలు అమాంతం పడిపోతుంటాయి. మరోవైపు త్వరగా పాడయ్యే ఉద్యాన ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేక రైతులు వచ్చిన ధరకు విక్రయించుకోవాల్సి వస్తోంది. ఈ సమయంలో సోలార్ డ్రైయర్ల ద్వారా పంట ఉత్పత్తులను ఎండ బెట్టి విలువ జోడించడం రైతులకు మెరుగైన ప్రత్యామ్నాయం. సోలార్ డ్రైయర్లు ఓ అద్భుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమని ఉద్యానశాఖ అధికారి ఆకుల వేణు తెలిపారు. పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలతోపాటు ధాన్యాల్లోని అదనపు తేమను తొలగించి పంట నష్టాన్ని తగ్గించేలా చేస్తుందని ఆయన వివరించారు.

రాయితీ ఇలా..

సోలార్ డ్రైయర్ల యూనిట్లకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. 70కిలోలు, వంద కిలోల సామర్థ్యం ఉన్న యూనిట్లు ఉద్యానశాఖ ద్వారా ఇవ్వనున్నారు. వాటికి ఆయా రైతులను బట్టి రాయితీ వర్తిస్తుంది. వివరాలకు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు.

సూర్యశక్తితో..

పండ్లు, కూరగాయలు, ఆకులు, ఇతర పంటలను సూర్యరశ్మి వేడితో తేమను తగ్గించి ఎండబెట్టే పరికరమే సోలార్ డ్రైయర్. ఉత్పత్తులను ట్రేలపై ఉంచి వేడి గాలి ప్రసరణ ద్వారా ఎండబెడతారు. బహిరంగ ప్రదేశాల్లో ఎండబెట్టినప్పుడు దుమ్ము, పక్షులు, కీటకాలు, ఆకస్మిక వర్షాల వల్ల నాణ్యత దెబ్బ తింటుంది. సోలార్ డ్రైయర్లలో ఉత్పత్తులను పరిశుభ్రంగా, సురక్షితంగా ఎండబెట్టుకోవచ్చు.

- మిరపను ఈ విధానంలో ఎండబెడితే నాణ్యత పెరిగి విలువ పెరుగుతుంది.
- పసుపు, అల్లం ఎండబెట్టి పొడి తయారీకి ఉపయోగించవచ్చు.
- ఉల్లిపాయ, వెల్లుల్లి, పౌడర్లకు ఈ విధానం ఉపయుక్తం.
- టమాట ఒరుగులు, ఫ్లెక్స్, పౌడర్లకు, మునగాకు, కరివేపాకు, కొత్తిమీర, ఎండిన ఆకులు పౌడర్ చేయడానికి, నాణ్యత మెరుగ్గా ఉండటానికి ఉపయోగం.
- మామిడి, అరటి ముక్కలు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులకు ఈ విధానం ఎంతో ఉపయోగం.
- పంటకోత అనంతరం నష్టాలను తగ్గించుకోవచ్చు, ఉత్పత్తులను పరిశుభ్రంగా ఎండ బెట్టడానికి, నిల్వకాలాన్ని పెంచకోవచ్చు.
- ఆహార ఉత్పత్తులు సహజ రంగు, రుచి, పోషకాలతో పాటు సువాసన పాడవకుండా ఉంటాయి.

పదిహేనేళ్లుగా పత్తి సాగు

మధిర, న్యూస్‌టుడే

పదిహేనేళ్లుగా పత్తి సాగు చేసి మంచి ఆదాయాన్ని గడిస్తున్నాడు ఓ యువరైతు. తనకున్న రెండెకరాలతో పాటు మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకొని కేవలం పత్తి సాగు చేసి ఏకపంటతోనే లాభాలు సాధిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఎక్కువ సమయం పత్తి చేలో పనిచేయటంతో పెట్టుబడులు తగ్గి కొంత ఆదాయం వస్తుందని అంటున్నారు ఆ యువ రైతు. అతనే మధిర మున్సిపాలిటీలోని దిడుగుపాడు గ్రామానికి చెంది దోర్నాల వెంకటరవి. వివరాలు ఆయన మాటల్లోనే.. 'నాకు సొంత ట్రాక్టర్, జత ఎద్దులు ఉన్నాయి. 30 ఎకరాల మెట్టభూమిని కౌలుకు తీసుకొని ఏటా పత్తి సాగు చేస్తున్నా. ఈ ఏడాది పరిస్థితులు సరిగా అనుకూలించకున్నా కొండంత ఆశతో పత్తినే సాగుకు ఎంచుకున్నా. రెండు నెలల క్రితం సాగు పనులు ప్రారంభించటంతో ప్రస్తుతం పైరు గూడ దశలో ఉంది. మరో నెలలో పంట చేతికందుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షపు జల్లులకు రసాయన ఎరువులు అందిస్తున్నా. దీంతో పైరు ఏపుగా పెరుగుతుంది. దుకాణాల్లో అప్పు లేకుండా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను నగదుతో కొనుగోలు చేస్తా. ఇతర పొలాల్లో ట్రాక్టర్‌తో కిరాయి పనులు చేసినప్పుడు వచ్చే డబ్బును ఇందుకోసం వినియోగిస్తా. ఫలితంగా పెట్టుబడులు తగ్గుతాయి. ఏటా ఎకరాకు 8 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. దళారీలకు విక్రయించకుండా సీసీఐ లోనే అమ్ముకోవటం ద్వారా ధర లభిస్తోంది. కౌలు భూమిలో సాగునీటి సౌకర్యం ఉన్న పది ఎకరాల్లో ప్రతి ఏటా పత్తి అనంతరం మొక్కజొన్న సాగుచేసి మరికొంత ఆదాయాన్ని పొందుతున్నా'.

పత్తి పైరు.. రైతు వెంకట రవి(అంతర చిత్రం)

పోటీ పరీక్షల్లో రాణించేందుకు వారధి

★ ప్రతినెలా ఉపాధ్యాయులకు సన్మానం

భద్రాచలం, న్యూస్‌టుడే

ప్రాథమిక విద్యలో ఉద్దీపకం వర్క్ పుస్తకాలు వచ్చిన తర్వాత విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. ఇప్పుడు హైస్కూల్ స్థాయిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 60 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 6,346 వారధి పుస్తకాలను అందించి బోధించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రత్యేక చొరవ తీసుకుని 8, 9 తరగతులు చదివే విద్యార్థుల కోసం ఐదుగురు ఉపాధ్యాయుల సహకారంతో 40 రోజుల్లో దీన్ని సిద్ధం చేశారు. జనరల్ ఇంగ్లిష్‌లో గ్రామర్ వంటి కీలక అంశాలతో పాటు గణితంలో రీజనింగ్, అర్థమెటిక్ వంటి వాటికి ప్రాధాన్యం కల్పించారు.

ఐటీడీఏ సిద్ధం చేసిన వారధి పుస్తకం

పోటీలో నెగ్గేందుకు...

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలను సాధించాలంటే విపరీతమైన పోటీ తప్పడం లేదు. కార్పొరేట్ విద్యాలయాల్లో చదువుకుంటున్న వారితో గిరిజన విద్యార్థులు పోటీ పడాల్సి వస్తోంది. గిరి పుత్రులకు సరస్వతీ కటాక్షం కలిగించేందుకు చదువుల్లో అగాథం అనేది ఉండకుండా లక్ష్యాల సాధనకు ఈ పుస్తకం వారధిగా పని చేస్తుందని భావిస్తున్నారు. రెండ్రోజుల్లో సంబంధిత ఉపాధ్యాయులకు బోధన గురించి శిక్షణ ఉంటుంది. భద్రాచలం, ఇల్లెందు, దమ్మపేట, ఖమ్మం ఏటీడీఓల పరిధిలో బోధనలో ప్రగతి సాధించిన ఉపాధ్యాయులకు ప్రతీ నెలా నలుగురు చొప్పున సన్మానం చేయాలని సంకల్పించారు.

5న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమీక్ష

గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ 4న రాత్రికి భద్రాచలం చేరుకుని 5న రాములవారిని దర్శించుకుంటారు. సమీపంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి టీవీ ద్వారా డిజిటల్ తరగతులను ప్రారంభిస్తారు. గురుకులాలను సందర్శించి సంక్షేమ పథకాలను అందిస్తారు. వైటీసీలో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి దిశానిర్దేశం చేస్తారు. భద్రగిరి మార్ట్‌లో సరకులను ఆన్‌లైన్‌లోను విక్రయించేందుకు పోస్టల్, ఆర్టీసీ కార్గో, కొరియర్ సేవలను విస్తరించేందుకు ఏర్పాట్లు జరుతున్నందున మార్ట్‌ను పరిశీలిస్తారు. ఈ మధ్యనే పీఓ బృందం భోపాల్ వెళ్లి అక్కడి మ్యూజియం నిర్వహణను పరిశీలించింది. భద్రాచలం మ్యూజియంలో రూ.కోటితో అదనపు సదుపాయాలను కల్పించనున్నారు. ఇందులో ఓపెన్ థియేటర్‌తో పాటు గిరిజన సంస్కృతిని చాటేందుకు ఒక్కో తెగకు చెందిన 17 రకాల అంశాలను అందుబాటులో ఉంచనున్నారు. దీన్ని మంత్రి పరిశీలించి వారధి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ఐటీడీఏలో సమీక్ష నిర్వహిస్తారు.

సీతారామ కల్యాణం ఆనందకరం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాత సేవ చేసి ఆరాధించారు. విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనం పలికారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. విష్వక్సేన పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. సమస్త మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా వేద మంత్రోచ్చారణ భక్తి ప్రపత్తులను పెంచగా మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక జరిగింది. 4న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా లాలలు జోలలు నిర్వహించి స్నపన తిరుమంజనం చేస్తారు. 5న ఉట్ల ఉత్సవం ఉంటుందని ఈఓ దామోదర్‌రావు తెలిపారు.

ప్రజల నమ్మకమే నా రాజకీయ బలం: మంత్రి తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ప్రజల నమ్మకమే తన రాజకీయ ప్రస్థానానికి బలమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.12 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదని, ప్రజల ఒత్తిడి మేరకే రాజకీయాల్లో ఉన్నానని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ పార్టీ, ఏ నాయకుడి ఇంటికి వెళ్లి పదవులు, టికెట్లు అడగకుండానే తన జీవితం గడిచిందని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ తాను ఖమ్మం నియోజకవర్గాన్ని కోరుకోలేదని, పార్టీ అధిష్ఠానం ఇక్కడకు పంపించినా ప్రజలు గుండెల్లో పెట్టుకొని గెలిపించారని స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా అన్ని పార్టీల నాయకులతో సహచర్యం ఉందని తెలిపారు. హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఖమ్మం ఒకటని, వందేళ్ల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లాలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిర్ణీత గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: గిరిజనుల అర్హతల మేరకు సంక్షేమ పథకాలను చేరవేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. మన్యంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి అందిస్తున్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఎస్డీసీ ఆనంద్‌కుమార్, డీడీ చందన, ఈఈ మధుకర్, ఏఓ రాంబాబు, మేనేజర్ ఆదినారాయణతో కలిసి దర్బారు నిర్వహించి వినతులు స్వీకరించారు. విన్నపాలను విని విజ్ఞాపన పత్రాలను సంబంధిత అధికారులకు పంపారు. వ్యవసాయ, ఉపాధి, రుణ, వైద్య సాయం కోసం వస్తున్న వారి సమస్యల పట్ల శ్రద్ధ చూపాలని చెప్పారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులకు న్యాయం చేయాలని సూచించారు.

☆ జీసీసీ నూతన డీఎం రామానందం.. పీఓను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం ఉందని పరిచయం చేసుకున్నారు. గిరిజనులకు ఉపాధి చూపించే విధంగా ప్రత్యేక ప్రణాళికలను తయారు చేసి అటవీ ఫలాలను సేకరించాలని నాణ్యమైన సరకులను విద్యాలయాలకు చేరవేసి వ్యాపార లావాదేవీలను పెంచాలని పీఓ సూచించారు. జీసీసీ మేనేజర్ జయరాజ్ పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న పీఓ రాహుల్

☆ గిరిజన ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షకుడు వెంకటస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించి ఇదే కార్యాలయంలో పని చేస్తున్న స్వర్ణలతకు ఇన్‌ఛార్జి పర్యవేక్షకురాలిగా బాధ్యతలు అప్పగించారు.

హెచ్చరిక బోర్డు వంగింది.. చెట్టు కొమ్మ చేరింది

కొత్తగూడెం-జగదల్‌పూర్ జాతీయరహదారిపై కలెక్టర్ కార్యాలయం వద్ద ఓ హెచ్చరిక బోర్డుకు ఓ భారీ వాహనం తగలడంతో బోర్డు వంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. ద్విచక్రవాహనదారుల తలకు తగిలేలా ఉన్న ఈ వంగిన హెచ్చరికబోర్డువల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుచూపుతో కొందరు ఈ హెచ్చరిక బోర్డు ప్రమాదాన్ని హెచ్చరిస్తూ చెట్టు కొమ్మలను ఏర్పాటు చేశారు. – కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

అంచనాల కమిటీ ఛైర్మన్‌గా కోరం బాధ్యతల స్వీకరణ

ఇల్లెందు, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం అసెంబ్లీలోని కార్యాలయంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ ఛైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీ శాసనసభకు సమర్పించబడిన బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తుందన్నారు. పరిపాలన, ప్రభుత్వ వ్యయాల్లో పొదుపు, మితవ్యయం, సామర్థ్యాన్ని పెంచేందుకు సూచనలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఆమోదించిన ఆర్థిక పరిమితులకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అనే అంశాలను పరిశీలిస్తుందని వివరించారు. కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరై విలువైన సూచనలు చేస్తూ సహకరించాలని కోరారు. సమావేశంలో శాసన మండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాశ్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, డి.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వి.యాదవరెడ్డి, శాసన సభ, మండలి ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఎఫ్‌టీసీ ఇన్‌ఛార్జి డీడీగా సరిత

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం రైతుశిక్షణ కేంద్రం(ఎఫ్‌టీసీ) ఇన్‌ఛార్జి ఉప సంచాలకురాలిగా సరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీడీగా పనిచేసిన కనకరాజు ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో 'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేస్తున్న సరితకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

నర్సు మృతదేహానికి అంతిమ సంస్కారాలు

ములకలపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో అత్యాచారం, హత్యకు గురైన నర్సు మృతదేహానికి సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పార్థివదేహం వద్ద అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, తెదేపా నియోజకవర్గ బాధ్యులు కట్రం స్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యులు అంజి, పైడి వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే జారె ఆదివారం రాత్రి నుంచి యువతి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పనులను పర్యవేక్షించి, యువతి పాడెను మోశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, దోషులకు శిక్షపడే వరకు కృషి చేస్తామన్నారు. యువతి కుటుంబంలో ఒకరి ఉద్యోగం, ప్రభుత్వం తరపున నగదు, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

యువతి పాడె మోస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

యువతి పేరు మీద చట్టం తీసుకురావాలి

దిశ, నిర్భయ తరహాలో బాధిత యువతి పేరు మీద చట్టం తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేయాలని, నర్సింగ్ పూర్తి చేసిన గిరిజన విద్యార్థులకు అనువుగా ఉండేలా గిరిజన ప్రాంతాల్లో వైద్యకళాశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని ఆదివాసీ, తుండు దెబ్బ రాష్ట్ర నాయకులు, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ర్యాక్ పాయింట్‌కు ఎరువుల రాక

చింతకాని, న్యూస్‌టుడే: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే ర్యాక్ పాయింట్‌కు సోమవారం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. 574 టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 765 టన్నుల డీఏపీ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ ఎరువును ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని సహకార సంఘాలకు, పలు ఎరువుల దుకాణాలకు లారీలు, ట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేశారు.

ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కరించండి: కలెక్టర్

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలు వింటున్న కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై అన్ని శాఖల అధికారులు సకాలంలో స్పందించి, వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీఆర్వో పద్మావతితో కలిసి వినతిపత్రాలు స్వీకరించారు.

★ పాల్వంచ పట్టణ పరిధిలోని పాలకొయ్య తండా, మంచికంటి నగర్ ప్రాంతాల్లో శ్మశానవాటిక లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సర్వే నెం.444లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 5 కుంటల భూమి కేటాయించాలని అక్కడి ప్రజలు కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించారు.

★ చుంచుపల్లి మండలంలోని బాబుక్యాంప్, విద్యానగర్ కాలనీ పరిధిలోని ఖమ్మం-కొత్తగూడెం ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంబాలకు పబ్లిసిటీ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని తొలగించాలని 'లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్)' జిల్లా అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, మోహన్ నాయక్, రాజు నాయక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

★ జూలూరుపాడు మండలానికి చెందిన బోడ అనిల్.. తన తండ్రి పేరు మీద ఉన్న ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి రికార్డుల్లో వేరొకరి పేరు మీద నమోదై ఉందని, అతనికి రైతు బంధు కూడా వస్తోందని, సమగ్ర విచారణ చేపట్టి ఆ భూమి తన పేరుపైకి మార్చాలని కోరారు.

★ దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన నడ్డి రాములు.. తనకు సర్వే నెం.673లో 30 కుంటల వ్యవసాయ భూమి ఉందని, పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకు మంజూరు చేయలేదని తనకు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు.

★ అన్నపురెడ్డిపల్లికి చెందిన భూక్య నీల... తాను పదో తరగతి వరకు చదువుకున్నానని, ఉపాధి అవకాశం చూపించాలని వినతిపత్రం అందించారు.

★ కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో మధు తెలిపారు. ఇల్లందులో మండలం నుంచి రెండు, కొత్తగూడెం కార్పొరేషన్ నుంచి రెండు దరఖాస్తులు, చుంచుపల్లి, దమ్మపేట మండలాల నుంచి ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు ఆయన తెలిపారు.

శివకుమార్ హత్య కేసులో నిందితుల అరెస్టు

★ పరారీలో మరో నలుగురు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరులో ఈ నెల 27న సింహాద్రి శివకుమార్(28)పై దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎంకే గ్యాంగ్‌కి చెందిన పలువురు యువకులు అతడిపై కక్ష పెంచుకోవడమే కారణమని తేల్చిచెప్పారు. మణుగూరు ఠాణాలో డీఎస్పీ రవీంద్రారెడ్డి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌కి చెందిన శివకుమార్ హైదరాబాద్‌లో ఇంటీరియర్ కాంట్రాక్టు పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గాంధీబొమ్మ సెంటర్‌కి చెందిన హర్ష, సుందరయ్యనగర్‌కి చెందిన సతీష్ అనే యువకులు అతడి దగ్గర పనిచేస్తున్నారు. అదే సెంటర్‌కి చెందిన లోకేశ్ అనే యువకుడు చదువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నెల రోజుల క్రితం లోకేశ్ సతీష్‌కి ఫోన్ చేసి పాత గొడవలు మనసులో పెట్టుకుని తిట్టాడు. వారిద్దరి మధ్య జరిగిన గొడవలో లోకేశ్ సతీష్‌ని కొట్టగా మధ్యలో శివకుమార్ జోక్యం చేసుకుని గొడవను ఆపాడు. లోకేశ్ ఎంకే గ్యాంగ్‌కి చెందిన లీడర్ జెట్‌పట్ రమాకాంత్‌కి చెప్పాడు. రమాకాంత్ సతీష్‌కి ఫోన్ చేసి శివకుమార్ మణుగూరు వస్తే అంతుచూస్తామని పలుమార్లు ఫోన్ చేసి బెదిరించాడు. ఆగస్టు 26న శివకుమార్, సతీష్, బన్నీ పనిలో ఉండగా, రమాకాంత్ సతీష్‌కి ఫోన్ చేసి రాఖీ పండగకు మణుగూరుకు వస్తే చంపేస్తామని బెదిరించాడు. పక్కనే ఉన్న శివకుమార్ ఫోన్ తీసుకుని మేము పనిలో ఉన్నామని, ఎందుకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నావని ప్రశ్నించాడు. రమాకాంత్ శివకుమార్‌ని ఫోన్‌లో బూతులు తిడుతూ మాట్లాడాడు. మళ్లీ అదే రోజు సాయంత్రం ఫోన్ చేసి నీవు మణుగూరుకు వస్తే ఇద్దరిలో ఎవరో ఒకడే బతకాలని బెదిరించాడు. శివకుమార్ 27న మణుగూరుకు వెళ్లి ఉదయం 11 గంటలకు అతడి ఇంటి పక్కన ఉన్న ఉదయ్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా మైదానానికి వెళ్లాడు. అప్పటికే ముందస్తు ప్రణాళికతో వేచి ఉన్న రమాకాంత్, సాధిక్, వినయ్, దినేశ్, జంపయ్య, ప్రసాద్‌లు చేతి కడియం, కర్రతో మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేశారు. శివకుమార్ తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య కేసులో 27 మంది ఉన్నట్లు గుర్తించామని, వారిలో 23 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. వారి నుంచి 9 ద్విచక్ర వాహనాలు, 20 సెల్ ఫోన్లు, కర్ర, చేతి కడియం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఏసు, సాంబరావు, నాగేంద్రబాబు, మల్లికార్జున్ పరారీలో ఉన్నట్లు వివరించారు. దర్యాప్తులో కృషి చేసిన సీఐ నాగబాబు, ఎస్సైలు నగేశ్, రవూఫ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి, చిత్రంలో సీఐ నాగబాబు, ఎస్సైలు

ఎమ్మెల్యే పీఏ ఖాతాలపై పోలీసుల ఆరా

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు వద్ద పీఏగా పని చేసిన కల్యాణ్ కుమార్ బ్యాంకు ఖాతాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. నగదు లావాదేవీలు ఏ విధంగా సాగించాడన్నది ఆయా బ్యాంకుల స్టేట్‌మెంట్‌లను సేకరిస్తున్నట్లు సమాచారం. తనతో పాటు తన కుటుంబానికి చెందిన వారి ఖాతాల్లో భారీగా జమ అవడంతో ఆ ఖాతాల వివరాల కూపీ లాగుతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నకిలీ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేశాడు. ఏడాది కాలంగా ఈ దందా సాగుతుండగా ఈ మధ్యనే వివాదం రచ్చకెక్కింది. ఈయన ఆగడాలను ఆలస్యంగా గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈయన నివాసం ఉంటున్న మణుగూరులోను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేయడంతో బాధితులు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. రూ.కోట్ల వసూళ్ల గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు క్షేత్ర స్థాయిలో సందర్శించి అసలు ఏం జరిగిందన్నది రాబడుతున్నారు. పీఏకు ఇంకెవరైనా సహకరించారా? అనే కోణంలో దృష్టి సారించారు. రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న కల్యాణ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునే వీలుంది.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రావిగూడెం దాస్యతండాకు చెందిన నిందితుడు బానోత్ రాజేశ్‌కు 6 నెలల జైలుశిక్షతోపాటు ఫిర్యాదుదారుకు రూ.3 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి బెక్కం రజనీ సోమవారం తీర్పు చెప్పారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు సిరికొండ వెంకటేశ్వర్లు తరపు న్యాయవాదులు ఇరుకులపాటి వెంకటేశ్వర్లు, వి.ప్రమీల దాఖలు చేసిన ప్రైవేటు కేసులో ఈ తీర్పు వెలువరించారు.

EENADU Classifieds

JOBS

Wanted Delivery boys and Office Staff Locations: Miryalaguda | Suryapet | Khammam Salary: ₹25k – ₹30k Contact / WhatsApp: 9398161694.

Applications are invited from the Candidates having B.A., B.Ed qualifications of work in a recognised Private English Medium School in Kothagudem. Special English and Male Candidates are preferable. Cont: 9963659568.

ఖమ్మం అత్యంత ప్రతిష్టాత్మకమైన వ్యాపార దిగ్గజం G.V. మాల్‌లో పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. ఏజ్ 35-45, అర్హత: 10th పాస్, మంచి జీతం. అన్ని ఆటోమేటిక్ కార్లు డ్రైవ్ చేసే వారికి ప్రాధాన్యత. సెల్: 8639773677.

కొత్తగూడెం G.V. మాల్ నందు పనిచేయుటకు క్యాషియర్ వెంటనే కావలెను. సంప్రదించండి: 9281115830.

ఖమ్మంలోని గ్యాస్ ఏజెన్సీలో ఆఫీస్ స్టాఫ్ (F), అకౌంటెంట్స్, క్యాషియర్స్, కం॥ ఆపరేటర్స్, క్లర్క్ (M/F), E-KYC చేయుటకు (M/F) కావలెను. ఖమ్మం: 9490791669.

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k .శిక్షణ రుసుము కలదు. Cell: 8886977792.

క్రిష్టియన్ రంగంలో పేరుగాంచిన స్కూల్స్/ కాలేజీలు/ హాస్పిటల్‌లో ఉద్యోగావకాశములు. జీతం: 18-40K ఆసక్తిగల అభ్యర్థులు సంప్రదించండి. క్రిష్టియన్ ఎడ్యుకేషనల్ గ్రూప్. వైజాగ్. 9491314477.

నిత్య అవసర సరుకులు ఇవ్వడానికి Delivery Boys, Stock Manage చేయడానికి Office Staff (M) కావలెను. Cell: 9701112339.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతి వేగం ఈనాడు క్లాసిఫైడ్స్

(c) eenadu

బెంచ్ ప్రెస్ పోటీల్లో క్రీడాకారుల సత్తా

పతకాలు సాధించిన క్రీడాకారులు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో మణుగూరు క్రీడాకారులు సత్తా చాటారు. సోమవారం నిర్వహించిన పోటీల్లో మణుగూరుకు చెందిన 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 16 మంది వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించారు. దివ్యాంగ క్రీడాకారుడు పాండురాజు 59 కిలోల కేటగిరీలో 110 కిలోల బరువుని ఎత్తి ప్రథమ స్థానం పొందాడు. మాస్టర్ 1 విభాగంలో పొదిల సుబ్బారావు, మాస్టర్ 2 విభాగంలో చిర్రా శ్రీనివాస్, మాస్టర్ 4 విభాగంలో దుర్గేశ్వరరావు, సీనియర్ మెన్ విభాగాల్లో పలువురు ప్రతిభ కనబర్చారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

రైతులకు అవగాహన

చంద్రుగొండ, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై మండలంలోని తుంగారంలో మండల పశువైద్యాధికారి డా. సంతోష్ రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుగులోత్ ప్రవీణ్, ఉప సర్పంచి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) భద్రాచలం: 79950 67029 అశ్వారావుపేట: 80085 73696 పినపాక: 91212 29033

సమస్య: అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం పంచాయతీ దిబ్బగూడెంలో పాఠశాల సమీపంలోని కాలనీ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపైకి ఇసుక కొట్టుకువచ్చింది. వాహన చోదకులు రాత్రిళ్లు ఇబ్బంది పడుతూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అసౌకర్యంగా ఉన్న ఇసుకను తొలగించగలరు
- బి.నరసింహారావు, దిబ్బగూడెం

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపి దిబ్బగూడెంలో రోడ్డుపై అసౌకర్యంగా ఉన్న ఇసుకను తొలగిస్తాం. **- సరిహద్దుల పోలయ్య, సర్పంచి, అచ్యుతాపురం**
– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని వినతి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు/అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు ముగ్గురు న్యాయమూర్తులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె. శ్రీనివాసరావు, జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ కాజా శరత్‌లను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలం-మణుగూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 600 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వారి దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలంలో కోర్టు ఏర్పాటు చేయడం వల్ల కక్షిదారులకు వృథా ఖర్చులు తగ్గుతాయని, పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, హైకోర్టు న్యాయవాదులు పీవీ కృష్ణమాచారి, సాల్మన్‌రాజు, న్యాయవాదులు మోహన్‌కృష్ణ, ప్రవీణ్, రామకృష్ణ, సురేశ్‌కుమార్, రజనీ, తరుణ్‌నాయుడు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ జె.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

డ్రైనేజీ నిర్మించాలని ఆందోళన

అశ్వాపురం: అశ్వాపురంలోని జగదాంబ సెంటర్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కమిటీ నాయకులు అన్నారు. సోమవారం వారు ఆ ప్రాంతంలో పర్యటించి మాట్లాడారు. రహదారిపై నుంచి ఇరువైపులా మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజల ఆరోగ్యానికి నష్టం కలుగుతోందని వాపోయారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి నరసింహారావు, సాంబశివరావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

భద్రాచలం, న్యూస్‌టుడే

నిత్యం రామనామాలు ప్రతిధ్వనించే భద్రాచలం రామాలయ పరిసరాలు ఇప్పుడు రామనామాలతో పాటు యంత్రాలు, కాంక్రీట్‌ను తరలించే టిప్పర్ల శబ్దాలతో దద్దరిల్లిపోతోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆధ్యాత్మిక కట్టడాలను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇదే ప్రాంగణంలో నూతన నిర్మాణాలు చేస్తున్నారు. కొద్ది రోజుల తర్వాత ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే స్థానికులకు సైతం రాకపోకల మార్గంపై గందరగోళం తప్పడం లేదు. తూర్పు మెట్ల మార్గం మినహా మిగతా దారుల్లో బారికేడింగ్ ఏర్పాటు చేశారు. రాత్రి 9.30 గంటల తర్వాత యాత్రికుల సందడి ఉండటం లేదు. ఈ ప్రభావం ఆయా దుకాణాల నిర్వాహకులపై పడుతోంది. యాభై ఏళ్ల చరిత్ర గల ఆంజనేయ స్వామి వారి ఆలయాన్ని 7న తొలగించేందుకు కళావాహన పూజలు చేస్తారు.

రామాలయ పడమర.. దక్షిణ మెట్ల తొలగింపు పూర్తి

దీనికి ముందు రోజైన 6న అంకురార్పణ ఉంటుంది.

నూతన నిర్మాణాలతో శోభ

డిసెంబరులో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వహిస్తారు. ఈ వేడుకలో ఉత్తర ద్వార దర్శన మార్గానికి ప్రత్యేకత ఉంటుంది. ఇక్కడ సెక్టార్‌లను ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా క్రతువు వీక్షించేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తారు. ఇది యథాతథంగా అమలు కావాలంటే తొలగించిన ద్వారం స్థానంలో శిల్ప కళా వైభవం ఉట్టి పడేలా కొత్త ఉత్తర ద్వారాన్ని తీర్చిదిద్దాలి. ఇందుకు సంబంధించి ఇటు వైపున నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఉత్తర ద్వారం గతంకన్నా విశాలంగా ఉంటుంది. దీంతో సెక్టార్‌లోని కొంతభాగం కొత్త నిర్మాణంలో కలుస్తుంది. ఆ తర్వాత సెక్టార్‌ను పెంచాలంటే సమీపంలోని మిథిలా ప్రాంగణం ముందు భాగాన్ని కలపాలి. ఇలా చేయడం వల్ల శ్రీరామ నవమి వార్షిక కల్యాణం నిర్వహించే మండప ప్రాంగణం కొంత మేర తగ్గుతుంది. డిజైన్‌ల ఆధారంగా ఈ పరిస్థితిని ప్రకటించాలని భక్తులు కోరుతున్నారు. నూతన నిర్మాణాలు పూర్తయితే సరికొత్త శోభ వస్తుందని అంతా ఎదురు చూస్తున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

శివరామకృష్ణను సత్కరిస్తున్న మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో తెలుగింటి కుర్రోడిగా బహుళ ప్రాచుర్యం పొందిన సత్తుపల్లి మండలం తుంబురుకు చెందిన ముత్తిన శివరామకృష్ణను మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల విశాఖ పట్టణంలో జరిగిన గాలా ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో శివరామకృష్ణ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. శివరామకృష్ణకు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. శివరామకృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

తక్షణ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోండి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఐటీఐ ప్రవేశాలకు కల్పించిన ప్రత్యేక అవకాశంలో భాగంగా స్పాట్ ప్రవేశాల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల అధ్యాపకులు కృష్ణారావు, మయ్యా శ్రీనివాసరావు సోమవారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు. సెప్టెంబరు 5వ తేదీ వరకు స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆహ్వానించినట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

తుక్కు విక్రయంతో ఆదాయం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: విస్తా కాంప్లెక్స్ వద్ద ఐటీడీఏ గదుల్లో ఉన్న 4 టన్నుల స్క్రాప్ మెటీరియల్ వేలం టెండర్ ద్వారా ఆదాయం రూ.1.65 లక్షలు సమకూరినట్లు ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ సోమవారం తెలిపారు. టెండర్ దాఖలు చేసిన నలుగురి సమక్షంలో టెండర్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. వారిలో పాడి సంజీవరెడ్డి (ఇల్లెందు) పాట దక్కించుకున్నారని ఏపీఓ వెల్లడించారు.

బాలికకు దుస్తులు అందిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, విజయ్, సిబ్బంది

ప్రాణాపాయం నుంచి బాలికను కాపాడిన వైద్యులు

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు కాపాడారు. పోలవరం జిల్లా చింతూరు మండలం బొడ్డురాయి గూడెం గ్రామానికి చెందిన ఎస్. వెంకటలక్ష్మి(14) తీవ్ర అనారోగ్యంతో గత నెల 26న ఇక్కడి ఆసుపత్రిలో చేరింది. ఆరు రోజుల కిందట కుటుంబ సభ్యులు ఇక్కడకు తీసుకొచ్చినప్పుడు హిమోగ్లోబిన్ 2 గ్రాములు ఉండటంతో శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడింది. బాలిక కుటుంబ సభ్యుల పరిస్థితి కారణంగా అత్యంత క్రిటికల్ కేసుగా గుర్తించి సేవలు అందించారు. విడతలవారీగా రక్తం ఎక్కించడం, రెస్పిరేటరీ సపోర్ట్ వంటి చికిత్సలను అందించడంతో బాలిక ఆరోగ్యం కుదుటపడింది. ఆమెను సోమవారం డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ డా. రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య సేవలు అందించిన పిల్లల వైద్యుడు డా. క్రాపా విజయ్, డా. నర్సింగ్ సిబ్బంది రాజ్యలక్ష్మిలను అభినందించారు.

'సర్' గ్రామసభలు

చంద్రుగొండ: మండలంలోని రేపల్లెవాడ, మంగయ్య బంజర్ పంచాయతీల్లో సోమవారం సర్ గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలకు తహసీల్దారు జగదీశ్వరప్రసాద్, ఆర్ఐ తిరుపతి రావు, బీఎల్వోలు హాజరై, ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై విచారణ చేపట్టారు. రేపల్లెవాడలో 190 మందికి నోటీసులు జారీ చేయగా, 80 మంది, మంగయ్య బంజర్‌లో 101కి, 83 మంది అవసరమైన పత్రాలు, సమాధానాలు అందించారని తెలిపారు.

గొలుసుకట్టు దుకాణాలు తొలగించండి

దమ్మపేట: దమ్మపేట పట్టణంలో గృహ సముదాయాల మధ్యన విచ్చలవిడిగా వెలిసిన గొలుసుకట్టు దుకాణాలను తొలగించాలని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేటలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెలికి తీసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో భారీ ప్రదర్శన, రెవెన్యూ కార్యాలయ ముట్టడి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, జిల్లా నాయకుడు గోకినేపల్లి ప్రభాకర్, అమర్లపూడి రాము, వీరబాబు, సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పినపాక: మండలంలోని పోతిరెడ్డిపల్లి భవిత కేంద్రంలో దివ్యాంగ బాలబాలికలకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందించారు. ఎంఈఓ నాగయ్య, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

మొండికుంటలో పశువైద్య శిబిరం

అశ్వాపురం, న్యూస్‌టుడే: మొండికుంటలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువుల సంతానోత్పత్తికి, గొంతువాపు, నురగ తదితర వ్యాధులకు టీకాలు వేశారు. సర్పంచి మర్రి సంధ్య, ఉప సర్పంచి శివారెడ్డి, ఫర్హానా పాల్గొన్నారు.

బూర్గంపాడులో పడకేసిన పారిశుద్ధ్యం

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని తెలంగాణ రైతు కూలీసంఘం నాయకుడు పున్నంచంద్ విమర్శించారు. బూర్గంపాడులో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏ వార్డు చూసినా రోడ్లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోయారు.

ప్రమాద సూచికలేవీ?

అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల మధ్య రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల్లోనే విద్యుత్తు స్తంభాలు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా బచ్చువారిగూడెం-అనంతారం, అశ్వారావుపేట-రామన్నగూడెం, ఆసుపాక-తిరుమలకుంట, గుమ్మడవల్లి-నందిపాడు దారుల్లో మలుపులు ఎక్కువగా ఉండటంతో పాటు చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి, మూల మలుపుల వద్ద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలని జనం కోరుతున్నారు. ఈ అంశాన్ని ర.భ.శాఖ డీఈ ప్రకాశ్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

మాంసం వ్యర్థాల తొలగింపు

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధి భద్రాచలం మార్గంలో రహదారి పక్కన మాంసం వ్యర్థాలు, హోటళ్లలో ఎంగిలి విస్తర్లు ఎట్టకేలకు తొలగించారు. ఈ నెల 31న 'రహదారి పక్కన మాంసం వ్యర్థాలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ జూపల్లి శశికళ స్పందించి రహదారి పక్కన ఉన్న వ్యర్థాలు, హోటళ్లలో తిని పారేసిన విస్తర్ల మూటలు, తాగి పారేసిన కొబ్బరి బొండాలను తొలగించి బ్లేడు ట్రాక్టర్‌తో ఆ ప్రాంతం అంతా శుభ్రం చేయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.
– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

అధ్వానంగా నడకదారి

అవసరం లేని చోట వాకింగ్ ట్రాక్ నిర్మించి వాటి ఆలనా పాలనా చూడకపోవడంతో అధ్వానంగా మారింది. అశ్వారావుపేట వెంకమ్మ చెరువుపై మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల వ్యయంతో చెరువు కట్ట ఆధునికీకరణ, వాకింగ్ ట్రాక్, కట్ట వైపు గోడ నిర్మాణం చేశారు. తరువాత నీటిపారుదలశాఖ అధికారులు వదిలేశారు. దీంతో చెరువు కట్టపై అందంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్ టైల్స్ ఊడిపోతూ అడవిలా తయారైంది. నీటిపారుదలశాఖ డీఈఈ వెంకటేశ్వరరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ శుభ్రం చేసేందుకు మున్సిపాలిటీలో నిధులున్నాయేమోనని కమిషనర్‌కు ప్రతిపాదన లేఖ పంపనున్నామని చెప్పారు. – అశ్వారావుపేట, న్యూస్‌టుడే

శుద్ధజల యంత్రం వితరణ

అశ్వాపురం, న్యూస్‌టుడే: అమ్మగారిపల్లికి చెందిన నేలపట్ల కోటిరెడ్డి తన నానమ్మ కమలమ్మ స్మారకార్థం రైతులు, ప్రజలకు సౌకర్యంగా ఉండటం కోసం రూ.10 వేల విలువైన ఎలక్ట్రికల్ వాటర్ ఫ్రిజ్‌ను సోమవారం అశ్వాపురంలోని రైతు వేదికకు వితరణగా అందజేశారు. ఎంపీడీఓ ముత్యాలరావు, ఏఓ మహేశ్‌చంద్ర చటర్జీ, కాంగ్రెస్ నాయకుడు కేశవరెడ్డి, తురమల గూడెం సర్పంచి కుంజా జాన్, గొల్లగూడెం ఉప సర్పంచి గణేశ్, ఏఈఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

హత్యాచార నిందితుణ్ని కఠినంగా శిక్షించండి

ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నర్సుగా పని చేస్తూ అత్యాచారం, హత్యకు గురైన యువతికి అన్ని మండలాల్లో సోమవారం రాత్రి నివాళి అర్పించారు. నిందితుణ్ని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ● అశ్వారావుపేటలో ఆదివాసీ సంఘాలు, పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో భారీస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, యువత, ఆదివాసీ ఐకాస నాయకులు, పార్టీల ప్రతినిధులు సోమవారం రాత్రి కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు, ఆదివాసీ సంఘాల నాయకులు, సర్పంచులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ● ములకలపల్లిలో ఆదివాసీ, ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. ● నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ దమ్మపేటలో ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు, గ్రామపెద్దలు కొవ్వొత్తులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నాయకులు దారా మల్లికార్జునరావు, దారా నాగేశ్వరరావు, ఆదివాసీ సంఘ నాయకులు తంగెళ్ల విశ్వనాథం, మహిళలు పాల్గొన్నారు. ● చంద్రుగొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బొర్రా సురేశ్, కృష్ణయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కొవ్వొత్తులతో శాంతిర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

గుండాల, న్యూస్‌టుడే: హంతకుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పూనెం రమణబాబు అన్నారు. సోమవారం గుండాల ప్రధానకూడలిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన బిడ్డలకు రక్షణ కల్పించాలని పీడీఎస్‌యూ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ సభ్యులు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, పూనెం కృష్ణ హాజరయ్యారు. మరో కార్యక్రమంలో భారాస నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

గుండాల: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ధర్నా

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ అశ్వారావుపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేస్తూ ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేసి వినతి పత్రాలు సమర్పించారు. ఆ పార్టీ నాయకులు కె. పుల్లయ్య మాట్లాడుతూ... రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని, ఇంటి స్థలం లేని పేదలకు స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు బుడితి చిరంజీవి, సోడెం ప్రసాద్, తగరం నిర్మల, మడకం గోవింద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, మొడియం దుర్గారావు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: ధర్నాలో సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: సీపీఎం ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్యచంద్రయ్య, శ్రీనుబాబు, కోటేశ్వరరావు, సత్యనారాయణ, చంటి, చిలకమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. వేణు, వెంకటాచారి, రాజా, రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బూర్గంపాడు, న్యూస్‌టుడే: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, షేక్ అబీద, రాయల వెంకటేశ్వర్లు, బోళ్ల శ్రీశైలం, భారతి పాల్గొన్నారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేశ్, గడ్డం స్వామి, నాయకులు ఎంబీ నర్సారెడ్డి, శరత్‌బాబు, రామారావు, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

దమ్మపేట, న్యూస్‌టుడే: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని సక్రమంగా అమలు చేయాలని సీపీఎం మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, కేశవరావు, శ్రీనివాసరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: బస్సులో నుంచి పూర్తిగా దిగకుండానే ముందుకు కదలడంతో ఓ మహిళ అదుపు తప్పి కిందపడగా గాయాలయ్యాయి. మణుగూరుకు చెందిన ఓ మహిళ భద్రాచలం వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో సోమవారం నెల్లిపాక బంజరకు వస్తున్నారు. నెల్లిపాక బంజర వద్ద ఆగగా ఆమె బస్సులో నుంచి పూర్తిగా దిగకుండానే ముందుకు కదలడంతో అదుపుతప్పి కింద పడ్డారు. ఆమెకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో భద్రాచలంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దమ్మపేట, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను అశ్వారావుపేట మండలం తిరుమలకుంట వద్ద దమ్మపేట రేంజ్ అధికారి శ్రీనివాసరావు, తన సిబ్బందితో కలసి ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను దమ్మపేట రేంజ్ కార్యాలయానికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజర్ తెలిపారు.

రైస్‌మిల్లు యజమాని అరెస్టు

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురంలోని ఓ రైస్ మిల్లు యజమానిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఇటీవల రైస్‌మిల్లును తనిఖీ చేయగా ధాన్యం, సీఎంఆర్ విషయంలో భారీ తేడా ఉన్నట్లు కనుగొన్నారు. దాదాపుగా ఈ తేడా రూ.2.68 కోట్లు ఉన్నట్లు సమాచారం. జిల్లా పౌరసరఫరాల అధికారులు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లయ్య తెలిపారు.

ప్రారంభం కాకముందే శిథిలం

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం మన్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో చిన్న లోపం ఉన్నా పరిశీలించి పరిష్కరించేందుకు ఐటీడీఏలోని ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాల్సి ఉంటుంది. నిర్మాణ పనులకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఈఈ వరకు నిత్యం ఇదే పనిలో ఉంటారు. ఇలాంటి అధికారులకు ఇదే ఐటీడీఏ కార్యాలయం పైభాగంలో కొత్తగా నిర్మించిన అదనపు గదుల స్లాబ్‌ను పరిశీలించే తీరిక లేనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రారంభం కాకుండానే గదుల విభాగం గోడకు స్లాబ్‌కు మధ్య రంధ్రం ఏర్పడి పనితీరును వెక్కిరిస్తోంది. ఈ ప్రాంతంలో చిన్న పగుళ్లు వచ్చి రంధ్రం కనిపిస్తోంది.

ఐటీడీఏలో నూతన నిర్మాణ సముదాయం ఇలా..

రూ.కోటితో కొత్త నిర్మాణం

ఖమ్మంలో 1975 మార్చి 12న ఐటీడీఏ వ్యవస్థ మొదలైంది. దీన్ని 1979 డిసెంబరు 17న పాల్వంచకు తరలించారు. పరిపాలన సౌలభ్యం కోసం 1993 ఫిబ్రవరి 9న భద్రాచలంలో ఐటీడీఏ ఏర్పడింది. దాదాపు మూడు దశాబ్దాల కిందట గ్రౌండ్ ప్లస్ వన్ పద్ధతిలో శాశ్వత భవనాలను నిర్మించి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇక్కడి అవసరాల కోసం దీన్ని గ్రౌండ్ ప్లస్ 2 పద్ధతిలోకి మార్చి పైభాగంలో మరో అంతస్తును గత ఏడాది రూ. కోటితో నిర్మించారు. ఇందులో ఒక పక్కన కొన్ని గదులను ఉపయోగించుకుంటున్నారు. ఇంకో పక్కన సమావేశ విభాగంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వీలుగా గదులను సిద్ధం చేశారు. వీటిలో ఫర్నిచర్ లేకపోవడంతో ప్రారంభం కాలేదు. ఇలాంటి చోట స్లాబ్‌కు గోడకు మధ్య ఉన్న జాయింట్‌లో సిమెంట్ పెచ్చులూడింది. ఇటుకలు ఊడి పోయి రంధ్రం పెద్దదిగా మారుతోంది. ఈ నిర్మాణం ఒకేసారి కాకుండా విడతల వారీగా చేపట్టడం వల్ల జాయింట్‌లో ఇలా అయి ఉంటుందని దీని వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.

హామీల అమలుకు నాయకుల డిమాండ్

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మణుగూరు భారాస మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు ఆరోపించారు. భారాస కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హామీలు నెరవేర్చకుండా, వెయ్యి రోజుల పాలన పేరుతో సంబరాలు నిర్వహించడం సరికాదన్నారు. అమలు కోసం ఈ నెల 2 నుంచి 8 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కుంట లక్ష్మణ్, పోశం నర్సింహారావు, రమేశ్, ముత్యం బాబు, అప్పారావు, శ్రీను, కృష్ణ, సురేశ్, రాంబాబు పాల్గొన్నారు.

మణుగూరు సాంస్కృతికం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులోని తహసీల్దార్ నరేశ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. నాగమణి, పద్మ, సాంబశివరావు, హేమంతరావు, నర్సయ్య పాల్గొన్నారు.

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆరు గ్యారంటీల అమలు కోసం భారాస ప్రజా గొంతుకగా మారనుందని ఆ పార్టీ మండల సమన్వయకర్త జూపల్లి కోదండ వెంకటరమణారావు తెలిపారు. అశ్వారావుపేటలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా కస్టమర్ దేవుళ్ళకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
ఇవే మా అన్నపూర్ణ హోటల్ వారి
హృదయపూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు
అన్నపూర్ణ హోటల్ - సత్తుపల్లి
ఈనాడు, సత్తుపల్లి: 8008001776

LIC ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు LIC

నా అభివృద్ధికి తోడ్పడిన నా కస్టమర్ దేవుళ్ళకు,
LIC అధికారులకు, నా తోటి ఏజెంట్ మిత్రులకు,
రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు
అందరికీ LIC 70వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు..
Gade Shantha Murthy
Chief Life Insurance Adviser, MDRT (USA),
చర్ల, భద్రాచలం. Cell: 7989442054

(c) eenadu

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

పతకాలు సాధించడం అభినందనీయం

పతకాలు సాధించిన యువతీ, యువకులను అభినందిస్తున్న కోచ్ సమీయుద్దీన్

చుంచుపల్లి, న్యూస్‌టుడే: పాల్వంచలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో కొత్తగూడెంలోని ఓ జిమ్‌కు చెందిన పలువురు వైద్య విద్య, ఇతర కోర్సులు చదువుతున్న యువతులు మొదటిసారిగా పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారు. వీరిని జిమ్ కోచ్ సమీయుద్దీన్ ప్రత్యేకంగా సోమవారం అభినందించారు. యువత చదువుతో పాటు శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించి పతకాలు పొందడం అభినందనీయమన్నారు.

శాశ్వత పనులపై దృష్టిసారించాలి

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలు పరిగణనలోకి తీసుకొని ఉపాధి పనులు గుర్తించాలని అడిషనల్ పీడీ రవి సూచించారు. మల్లారం గ్రామంలో వీజీపీపీ పనులు గుర్తించడానికి సర్పంచి విజయ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. శాశ్వతంగా నిలిచే పనులపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలన్నారు. ఏపీడీ రమణ, డీటీసీ రాజు, ఏపీవో రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: పట్టణంలోని సత్యనారాయణపురం వాగు నుంచి దోమలు పెరిగి ఇళ్లల్లోకి వస్తున్నాయి. - **స్థానికులు**

సమాధానం: ఫాగింగ్ చేయిస్తాం.

- **వెంకటేశ్వర్లు పురపాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పట్టణంలోని రైల్వే బ్రిడ్జి నుంచి 19వ వార్డుకు వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడి మురుగు నీరు నిల్వ ఉంటోంది. - **శివాజీ, స్థానికుడు** ✔ గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. - **నవీన్ పురపాలిక ఇన్‌ఛార్జి డీఈ**

– ఇల్లెందు, న్యూస్‌టుడే

కలుషిత నీటితో భోజనం వండారని నిరసన

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: చుంచుపల్లి మండలం బాబూక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి ట్యాంకులో బల్లి పడిందని, ఆ కలుషిత నీటితోనే వంట చేశారని విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు ఆహార పదార్థాల పాత్రలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ట్యాంకు నీటిలో బల్లి కుళ్లిపోయిందని, ఆ నీటితోనే వంట చేయడం దారుణమన్నారు. ఎంఈఓ నీరజ స్పందిస్తూ ఆదివారం ట్యాంకులో నీటిని పట్టే క్రమంలో బల్లి పడిపోయి ఉండవచ్చునని, వంట నిర్వాహకులు చూసుకోకుండా వంటలు వండారన్నారు. మళ్లీ వేరే నీటితో వంట చేయించామన్నారు.

ఆదాయమివ్వని 'సమీకృతం'..

వృథాగా భవన సముదాయం

కొత్తగూడెం పట్టణం,న్యూస్‌టుడే

రూ.4కోట్ల సమీకృత వ్యాపార భవన సముదాయంలో చిట్టడవి

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత భవన సముదాయం) చిట్టడవిని తలపిస్తోంది. నగరం నడిబొడ్డున అసంపూర్తిగా నిలిచిపోయిన భవన సముదాయం అభివృద్ధిని వెక్కిరిస్తోంది. మొండి గోడల నడుమ పిచ్చి మొక్కలు పెరిగి రూ.4 కోట్ల నిధులను వృథా చేస్తోంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన భవన సముదాయం ఇప్పటికీ నత్తనడకన సాగుతూనే ఉంది. అన్ని రకాల వ్యాపారాలు ఒకే చోట నిర్వహించాలనే సదుద్దేశం నీరుగారుతోంది. ఇప్పటి వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు మార్కెట్ సముదాయాన్ని పూర్తి చేసేందుకు ఎలాంటి చొరవ చూపడం లేదు. ఫలితంగా కోట్లాది రూపాయల విలువ చేసే స్థలం.. అందులో నిర్మాణం కోసం వెచ్చించిన కోట్ల రూపాయలు నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. ప్రజాధనం దుర్వినియోగానికి ప్రతీకగా అసంపూర్తి భవనాలు గోడలు నిలిచిపోతున్నాయి. నివాస గృహాల, రైతుబజార్, నగరపాలక మార్కెట్ల మధ్యలో సగం.. సగం పనులతో వదిలేసిన ప్రదేశంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అపరిశుభ్రంగా ప్రాంగణం మారిపోవడంతో విష కీటకాల సంచారం పెరిగిపోయింది. ప్రజా ప్రయోజనాల కోసం తలపెట్టిన పనులను ముందుకు సాగించడంలో ఎవరూ స్పందించిన దాఖలాలు లేకుండా పోతున్నాయి. నగర అభివృద్ధి జపం చేస్తున్న ప్రజా ప్రతినిధులు కిమ్మనకుండ ఉండిపోతున్నారు. ఆదాయ వనరుగా మార్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. అసంపూర్తిగా ఉన్న భవనాలను అద్దెలకు అప్పగించి కార్పొరేషన్‌కి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే విధానాలపై దృష్టి సారించడం లేదు. ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా పట్టించుకోవడం లేదంటూ స్థానిక కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం ఆ పనులకు సంబంధించి ఎలాంటి నిధులు అందుబాటులో లేవని, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పితే పనులు ప్రారంభించే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. అందుకు సంబంధించి నిధులు సైతం అనివార్యంగా పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ వినియోగానికి సంబంధించి అంశాన్ని మాత్రం ప్రస్తావించడం లేదు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషి

వీరబాబు అందించిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్న రేణుకా చౌదరి

చుంచుపల్లి, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు సోమవారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదన పత్రాలతో పాటు వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

వామ్మో కోతులు

పట్టణంలో కోతుల సమస్య తీవ్రంగా మారింది. ప్రతి వార్డులో కోతులు సంచరిస్తూ స్థానికులను భయపెడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనులకు వెళ్లే వారిపై ఎగబడి దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి అందిన ఆహార పదార్థాలను ఎత్తుకుని వెళ్తున్నాయి. పురపాలిక అధికారులు స్పందించి కోతుల సమస్య పరిష్కరించాలని ప్రజలు, వార్డు కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. – ఇల్లెందు, న్యూస్‌టుడే

మతోన్మాద విధానాలపై పోరాటం

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి ఐసీ ఘోష్

సుజాతనగర్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐసీ ఘోష్ అన్నారు. సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని అబ్దుల్‌కలాం ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మందా నాగకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జెన్‌జీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దిల్లీ జంతర్ మంతర్ వద్ద పరీక్ష పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జెన్‌జీ నిర్వహించిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు దారిచూపిన ఉద్యమం అన్నారు. విద్యార్థులు విద్యా ఉద్యోగ హక్కుల కోసం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ దేశంలో విద్యార్థుల సమస్యలు వ్యక్తిగతమైనవి కావని ప్రభుత్వ విధానాలతో ముడిపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు అఖిల్, భానుచరణ్, సాయికిరణ్, సాయిసంతోష్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఇల్లెందు, న్యూస్‌టుడే: యువకుడు అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండంలోని బొజ్జాయిగూడెంకు చెందిన చింతా శేఖర్ ఈ నెల 23వ తేదీన తన బేకరీ షాపు నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడా వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఈ విషయమై అతని అన్న బి.సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

భర్త వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయురాలిని వేధిస్తున్న భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కారేపల్లి మండలం పేరుపల్లికి చెందిన జీ.సరస్వతి మండలంలోని మేడికుంట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. కొన్నేళ్లుగా భర్త రమేశ్ వేధిస్తున్నాడు. ఈ నెల 29న పాఠశాలకు వచ్చి అందరి ముందు అసభ్యకరంగా ప్రవర్తించి బెదిరించాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై పోరుబాట

మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన వైఫల్యాలపై సెప్టెంబరు 2నుంచి వారం రోజులపాటు నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటైన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, వెయ్యిరోజులు గడుస్తున్నా నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. సెప్టెంబరు 2న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. కాపు సీతాలక్ష్మి, వేల్పుల దామోదర్, భీమా శ్రీధర్, సాగర్, రాజుగౌడ్, మల్లెల రవిచంద్ర, గుణచరిత్, సింధుతపస్వి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కల్యాణ్ కుమార్ జిల్లాలోని పలువురి వద్ద ఉద్యోగాలు, బదిలీల కోసమని కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసగించాడని బాధితులకు న్యాయం చేయాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా ఛైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, ఐటీసీ వంటి పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో శాశ్వత పోస్టులతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టించడం వెనుక ఎవరెవరు ఉన్నారనే దానిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ రమేశ్, గుగులోత్ భద్రు, భరత్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీఓలతో సమీక్ష

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 22 మండలాల ఎంపీడీఓలతో కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం కలెక్టరేట్ నుంచి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇళ్ల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడితో మాట్లాడి, పనుల్లో వేగం పెంచే విధంగా చూడాలని, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, హౌసింగ్ పీడీ సవయ్‌రామ్, వివిధ మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ లెక్కలు చెప్పాలి

ఇల్లెందు సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో పని చేసే ఒప్పంద కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు చెప్పాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ షా వలీ డిమాండ్ చేశారు. పట్టణంలో జరిగిన సింగరేణి వాహనాల డ్రైవర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వేతనాల చిట్టీలు ఇవ్వాలని, కార్మికులకు సింగరేణి వైద్యశాలల్లో వైద్య సదుపాయం కల్పించాలన్నారు. బ్రాంచి కార్యదర్శి రఘు, నాయకులు రామనర్సయ్య, రాజేశ్, శివ, వెంకటేశ్, మహేశ్, రవి, కిశోర్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా సాయికుమార్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని సోమవారం చెంగల గురునాథం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా దిబ్బెందుల సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా గార్లపాటి నవీన్, ప్రధాన కార్యదర్శిగా దొంగల సృజన్, సహాయ కార్యదర్శిగా పోతురాజు అనిల్‌కుమార్, కోశాధికారిగా ఉబ్బపల్లి నరసింహారావు, అధికార ప్రతినిధిగా గార్లపాటి నిఖిల్, కార్యవర్గ సభ్యుడిగా జంగం నాగరాజును ఎన్నుకున్నారు.

భాజపా కార్మిక విభాగం జిల్లా కన్వీనర్‌గా గుమలాపురం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భాజపా కార్మిక విభాగం జిల్లా కన్వీనర్‌గా గుమలాపురం సత్యనారాయణ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ అందజేశారు. గుమలాపురం భాజపాకు సుదీర్ఘకాలం నుంచి అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి, ఆయనకు ఈ పదవిని అప్పగించినట్లు అందె శ్రీనివాస్ తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల సమీపంలో గొలుసు దుకాణం తీయాలంటూ ఫిర్యాదు

లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి: చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల, దేవాలయం సమీపంలో మద్యం బెల్టు దుకాణాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచి బానోత్ కేస్లీ ప్రజావాణిలో ఎంపీడీవో సుభాషిణికి ఫిర్యాదు చేశారు. పంచాయతీరాజ్, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లపై మొత్తం 19 ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇంటి సమస్యపై ఒక ఫిర్యాదు ఎంపీడీవో సుస్మితకు అందింది. కార్యక్రమాల్లో తహసీల్దార్లు నాగరాజు, శిరీష పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఏర్పాటు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రామమహేశ్, ఏఎంసీ ఛైర్మన్ అన్నారు. సోమవారం పోచారంతండా, బోయితండా, మాణిక్యారం, ముత్తారపుకట్ట, రొంపేడు, మామిడిగుండాల, సీఎస్పీబస్తీ పంచాయతీల పరిధిలో పర్యటించి నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. హరికృష్ణ, సతీష్, కోటేశ్వరరావు, భార్గవ్, సురేందర్, భారతి, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్

టేకులపల్లి: గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధారావత్ సురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీఓను ప్రాజెక్ట్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించామని టేకులపల్లిలో విలేకరులకు వెల్లడించారు. గతంలో ఐటీడీఏ ద్వారా రైతులకు జారీ చేసిన తాత్కాలిక మెమోలు ఎక్కడా చెల్లుబాటు కావడం లేదన్నారు.

పరిమితికి మించిన బరువు

అధికలోడ్‌తో వెళ్తున్న బొగ్గు లారీ

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: నిబంధనల అతిక్రమణకు జిల్లా కేంద్రంలో అధికారులు ఆజ్యం పోస్తున్నారు. ప్రమాదకర ప్రయాణాలకు గ్రీన్ సిగ్నల్స్ ఇచ్చేస్తారు. మొక్కుబడి తనిఖీలతో మమ అన్పించేస్తున్నారు. ఇల్లెందు రహదారిలో పరిమాణానికి మించి బొగ్గును టిప్పర్లలో గుట్టల్లా పేర్చుతున్నారు. వాటిపై టార్పాలిన్లు కట్టినా.. ప్రయాణ సమయాల్లో రహదారులపై బొగ్గు రాళ్లు ఊడిపడుతున్నాయి. వెనుక వచ్చే ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు పరిమితికి మించి లోడ్ వేయకూడదు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా అతిక్రమణలు కొనసాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఇల్లెందు దారిలో ఆ బొగ్గు టిప్పర్లు ప్రయాణిస్తే ఇతర వాహనదారులకు సందు దొరకని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

యాజమాన్యంతో చరిత్రాత్మక ఒప్పందం

వైటింక్లయిన్‌కాలనీ: కార్మికుల సమస్యల సాధనలో భాగంగా ఏఐటీయూసీ సింగరేణి యాజమాన్యంతో చారిత్రాత్మక ఒప్పందం చేసుకొన్నట్లు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు, ఆర్జీ-2 కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. సోమవారం కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నియంత్రికల వద్ద రక్షణేది?

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

కొత్తగూడెం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికల వద్ద రక్షణ కంచెలు లేకపోవడం కలవరపెడుతోంది. ప్రధానంగా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రోడ్డు పక్కనే నియంత్రికలను ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు పూర్తిగా పాడైపోవడం, గేట్లు లేకపోవడంతో ప్రమాదాలకు హేతువుగా మారుతున్నాయి. కొత్తగూడెం పట్టణంలోని డాక్టర్ కంభంపాటి రంగారావు ఆసుపత్రి లైన్, రైతుబజార్ వద్ద, కొత్తగూడెం త్రీ టౌన్ సెంటర్, పెద్ద బజార్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. విద్యుత్తు నియంత్రికలున్న పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండి పోయి పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. విద్యుత్తు తీగలకు చెట్ల తీగలు అల్లుకుపోతున్నాయి. వారంలో ఒక రోజు విద్యుత్తు మరమ్మతుల కోసం అంటూ సరఫరా నిలిపివేసి, లైన్లు మాత్రమే మరమ్మతులు చేపడుతున్నారే తప్పా.. విద్యుత్తు నియంత్రికల వద్ద ఉన్న ప్రమాదకర పరిస్థితులను విద్యుత్తు సంస్థ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

✧ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసినా విద్యుత్తు స్తంభాలకు కేబుల్ వైర్ల కట్టలే దర్శనమిస్తున్నాయి. కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన రహదారి, ఏంజీ రోడ్, పెద్ద బజార్,

కంచెలు ఏర్పాటు చేయకపోతే ప్రమాదాలు తప్పవు

చిన్న బజార్, లేపాక్షిలైన్, కూలీలైన్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏ పోల్‌కు చూసిన లెక్కకు మించిన సర్వీసులు ఉండటంతోపాటు, అదే పోల్‌కు కేబుల్ వైర్ల కట్టలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థ అధికారులు మొదట్లో కేబుల్ ఆపరేటర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, కేబుల్ వైర్ల కట్టలు తొలగించాలని, వదులు తీగలను సరి చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మొదట్లో కొంత వరకు మార్పు వచ్చినా, ఆ తర్వాత షరా మాములే. . దీంతో కేబుల్ వైర్లు కరెంట్ స్తంభాలకు కదుతుండటంతో అవి వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్తు సంస్థ అధికారులు కొత్తగూడెం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, నియంత్రికల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్తు స్తంభాలకు కేబుల్ వైర్ల కట్టలు లేకుండా చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ ఎఫ్ఐఆర్ ఎత్తివేయాలని ధర్నా

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ ఎఫ్ఐఆర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఎంజీరోడ్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అవమానించిన భాజపా, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగసీతారాములు, నాయకులు ఆళ్ల మురళి, చీకటి కార్తీక్, వై.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం చేసిన నిందితుడిని శిక్షించాలి

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నర్సు విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ యువతిని అత్యంత కిరాతంగా హత్యచేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఆధార్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు గొంది వెంకటరమణ, వివిధ గిరిజనుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లిలో సోమవారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పూనెం శ్రీను, తాటి పద్మ, తిరుమలేశ్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, స్వామి, రామనాథం తదితరులు ఉన్నారు.

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఆదివాసీ యువతిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన దుండగులను శిక్షించాలని పీవోడబ్ల్యూ నిరసన వ్యక్తం చేసింది. రైటర్ బస్తీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు ఆదిలక్ష్మి, కల్యాణిలక్ష్మి, కరుణ, నాగలక్ష్మి, రాజమ్మ, విజయ, సునీత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీ యువతి మృతికి కారకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భారాస నియోజకవర్గ నాయకుడు చీమల సత్యనారాయణ డిమాండ్ చేశారు. టేకులపల్లిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు.

విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి

ఇల్లెందు గ్రామీణం: విద్యార్థులను సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసేలా విద్యాసంస్థల స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్స్, కెప్టెన్‌ల సమావేశం ఏర్పాటు చేయాలని స్కౌట్స్ మాస్టర్ జిల్లా సమన్వయకర్త సతీష్ ఖండేల్వాల్ తెలిపారు. ఈ మేరకు ఇల్లెందు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ధన్‌సింగ్, పుర కమిషనర్ సందీప్‌లకు వినతిపత్రం అందజేశారు.

★ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఎంఈఓపై విచారణ జరిపించాలని వినతి

టేకులపల్లి, న్యూస్‌టుడే: విద్యాశాఖ నిబంధనలను, కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న టేకులపల్లి ఎంఈఓపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీఎస్‌టీటీఎఫ్, ఏటీఏ, ఏటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హరికుమార్, లక్ష్మణ్, రామరాజు, సమ్మయ్య, ఫుల్‌సింగ్, వెంకట్రావ్, రవి, రామారావు, చందర్ సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఎంఈఓ జగన్‌ను వివరణ కోరగా.. ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తిగా డీఈఓ పరిధిలో ఉంటుందన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు టి.రాజారెడ్డి, ముత్యంరావు కోరారు. అక్టోబరు 10, 11 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే కౌన్సిల్ సమావేశాలకు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. కుమారస్వామి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు గ్రామం వెలుపల ఉన్న కప్పలకుంట సమీపంలోని చేతి పంపు నుంచి ఆరు నెలలుగా తుప్పు వస్తోందని, అవే నీరు తాగుతున్నామని, ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యను ఎంపీడీఓ తాళ్లూరి రవికి విన్నవించారు. 20 ఏళ్లుగా చేతి పంపు నీటినే జూలూరుపాడు, కోయకాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఎస్సీ కాలనీ, వెంగన్నపాలెం గ్రామస్థులు సైతం తాగునీటి కోసం ఈ చేతిపంపుపైనే ఆధారపడ్డారని తెలిపారు. ఎంపీడీఓ సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఫోన్ ద్వారా సమస్యను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు. సీపీఎం ఆధ్వర్యంలో పడమటినర్సాపురంలోని ఆశ్రమ పాఠశాలలో జనరేటర్ ఏర్పాటు చేయాలని, 30 పడకల ఆసుపత్రిలో సేవలు అందుబాటులోకి తేవాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని విన్నవించారు.

ఎంపీడీఓకు సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఐదుగురికి గాయాలు..

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. బూర్గంపాడు మండలం ఉప్పుసాకకు చెందిన కౌశిక్, సంపత్, దుర్గ పాల్వంచ నుంచి నివాసానికి ఒకే ద్విచక్రవాహనంపై సోమవారం సాయంత్రం వెళ్తున్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని రాహుల్ గాంధీనగర్ సమీపంలో ముందు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మీనాక్షి శ్రీనివాస్ నాయక్‌ను ఢీకొట్టి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిని పాల్వంచ సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంపత్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం తరలించారు.

వడపోత.. తర్వాతే చేయూత

జూలూరుపాడు, న్యూస్‌టుడే

దరఖాస్తులను భద్రపరుస్తున్న సిబ్బంది

మండలంలో చేయూత పథకం కింద దరఖాస్తులు వందల్లో రాగా, వాటిని సిబ్బంది ఎప్పటికప్పుడు భద్రపరుస్తున్నారు. సోమవారం నాటికి స్వీకరణకు చివరి తేదీ కావడంతో అధికారులు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు.

✧ మండలంలోని 24 పంచాయతీల పరిధిలో చేయూత పథకం కింద పింఛన్ల కోసం 468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులు, అనర్హులను గుర్తించేందుకు వడపోత కార్యక్రమం ఉండనుందని అధికారులు చెబుతున్నారు. కొందరు అనర్హులైనప్పటికీ చేయూత పొందాలనే ఉద్దేశంతో దరఖాస్తులు అందించినట్లు ఇప్పటికే అధికారుల దృష్టిలో ఉన్నందున వాటిపై పూర్తిస్థాయిలో వివరాలను తనిఖీ చేయనున్నారు.

✧ దరఖాస్తులో సమర్పించిన ధ్రువీకరణ పత్రాల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవమేనని తేలితే అలాంటి వారిని అర్హులుగా గుర్తించే అవకాశం ఉంది. లేదంటే అనర్హుల కిందనే జమకట్టనున్నారు.

✧ మండలంలో వితంతు పింఛను కోసం 301, ఒంటరి మహిళలు 20, దివ్యాంగుల నుంచి 147 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఇప్పటికే ఆన్‌లైన్ చేశారు. ఇక మిగిలింది వడపోతనే. ఈ ప్రక్రియ తర్వాతే అసలైన లబ్ధిదారుల జాబితా వెలువడనుందని ఎంపీడీఓ తాళ్లూరి రవి తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కార్పొరేషన్ ఉపకార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కార్పొరేషన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ కె.సుజాతకు అందజేశారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు లిక్కిబాలరాజు, రమేశ్, ప్రసాద్, ఎం.ఎస్.ప్రకాశ్, వెంకటేశ్వర్లు, లక్ష్మి పాల్గొన్నారు.

పాల్వంచ, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని డివిజన్లలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయం నుంచి పాల్వంచ కార్పొరేషన్ డివిజన్ కార్యాలయం వరకు నాయకులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పారిశుద్ధ్య అధికారి అశోక్‌చౌహాన్‌కు అందించారు. తులసిరామ్, దొడ్డ రవికుమార్, జ్యోతి, కాంతి, గౌసియా పాల్గొన్నారు.

సుజాతనగర్, న్యూస్‌టుడే: నాలుగు డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేశ్ అధ్యక్షతన కార్పొరేషన్ ఉపకార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటి సభ్యులు ధర్మ మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

(c) eenadu